క్లుప్తంగా

ఐదురోజులుగా నిలిచిన నీటి సరఫరా

చంద్రుగొండ: మండలంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గడిచిన ఐదురోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిపివేయడంతో మండలవాసులు తాగునీటికి ఇబ్బందులు పడున్నారు. మండలంలోని అయన్నపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన భగీరథ మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో మరమ్మతు పనులకు శాఖాధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఐదురోజులు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదు. ప్రత్యామ్నయం లేకపోవడంతో నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడున్నారు. మండలానికి శనివారం వచ్చిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సమస్య తెలియడంతో భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు.

ట్యాంకర్ ద్వారా సరఫరా

మండలకేంద్రం చంద్రుగొండలోని కొన్ని వీధులకు కాంగ్రెస్‌పార్టీ మండల నాయకుడు సారేపల్లి శేఖర్ తన సొంత ట్యాంకర్‌తో శనివారం తాగునీటి సరఫరా చేయించారు. కాగా, మెయిన్ పైప్‌లైన్ జాతీయ రహదారిపై లీకవడంతో మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోందని, సాధ్యమైనంత త్వరగా నీటి సరఫరా పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని భగీరథ ఏఈ హరికృష్ణ తెలిపారు.

జాతీయ రైతు దినోత్సవం



మణుగూరురూరల్: తహసీల్దార్‌కు కేక్ తినిపిస్తున్న రైతులు

దుమ్ముగూడెం: మండలంలోని మహాదేవపురం రైతువేదికలో ఐటీసీ బంగారు భవిష్యత్తు, మైరాడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జాతీయ రైతు దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు.అనంతరం భద్రాద్రి జిల్లా కృషి విజ్ఞానకేంద్రంకు చెందిన డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వ్యవసాయం చేసే ప్రతీ రైతు వ్యవసాయం భారంగా కాకుండా బాధ్యతగా చేయ్యాలని సూచించారు. రైతులందరూ మట్టిని సంరక్షిస్తూ తక్కువ మోతాదు పురుగుమందులు వాడుతూ సేంద్రియ వ్యవసాయం వైపు పయనించాలని సూచించారు. మైరాడ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు అధికారి అజయ్, సర్పంచ్‌లు సుమిత్ర, సీతారామయ్య,ఎంపీటీసీ మడకం రామారావు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతుల సమక్షంలో తహసీల్దార్ రాఘవరెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాజీ పూజారిపై ఫిర్యాదు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం వద్ద దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న గంగానమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం రాత్రి అనుమానస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో ఇదే ఆలయంలో పూజారిగా వ్యవహరించిన వ్యక్తిగా గుర్తించి, రాత్రి 7గంటల సమయంలో ఆలయం వద్దకు ఎందుకు వచ్చావని ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం వచ్చినట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం ఆలయంలో అమ్మవారి విగ్రహ శిరస్సును తీసుకెళ్లావని, మళ్లీ ఏం తీసుకెళ్లేందుకు వచ్చావంటూ.. గ్రామస్తులు చుట్టు ముట్టారు. దాంతో గ్రామస్తులతో ఘర్షణ పడి, ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడు. ద్విచక్రవాహనాన్ని రాత్రి 10గంటల సమయంలో గ్రామస్తులు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆలయం వద్ద గుప్త నిధులు తవ్వకాలు చేసేందుకే రాత్రి వేళలో వచ్చి ఉంటాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఐఎన్‌టీయూసీని గెలిపించండి

మణుగూరురూరల్: ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలిపించాలని ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమరాజు, నామ వెంకటేశ్వరరావు, సామా శ్రీనివాస్‌రెడ్డిలు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శనివారం మణుగూరు ఏరియాలోని ఓసీ-2లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బోగ రాజలింగు, జె.కరుణాకర్, టి.పెద నాగయ్య, రాంశెట్టి కృష్ణచేతన్, ఎండి.కరీమ్, కె.శివకుమార్, ప్రతాప్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌తోనే సంక్షేమం

మణుగూరురూరల్: కార్మికుల సంక్షేమం టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2లో జరిగిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, సిహెచ్‌వి రెడ్డి, కాపా శివాజీ, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, మునిగెల రమేష్, అశోక్, బి.వెంకటేశ్వర్లు, కేవీ రమణ, కృష్ణ, హనుమంతరావు పాల్గొన్నారు.

కనుల పండువగా ఏకాదశి

- పర్ణశాల, ఇతర ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం
- పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు



ఉత్తర ద్వారంలో పర్ణశాల సీతారామచంద్ర స్వామి, లక్ష్మణ స్వామి



పర్ణశాల పురవీధుల్లో ఊరేగింపు..



అన్నపురెడ్డిపల్లి: ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం ఇస్తున్న వేంకటేశ్వర స్వామి

దుమ్ముగూడెం: ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు పురస్కరించుకుని పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తరద్వార దర్శనంలో వైభవంగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం వేకువ జామున ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, నరసింహాచార్యులు ఆలయంలో స్వామి వారికి సుప్రభాతం తిరువారాధన, పంచామృతాభిషేకం మూలవర్లకు నూతన పట్టు వస్త్రాలంకరణ ధనుర్మాసాన్ని పురస్కరించుకుని 18వ పాశురం స్వామివారికి విన్నవించారు. విశేష ప్రసాద నివేదన కార్యక్రమం జరిగింది. ఉత్సవర్లకు తిరుమంజనము పట్టు వస్త్రాలంకరణ అనంతరం ఉత్తర ద్వారం గుండా స్వామివారు గరుడ వాహనంపై వేంచేసి ఐదు గంటలకు ఉత్తర ద్వారం తెరచి భక్తులకు స్వామి వారు దర్శనం అందించారు. ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం భాగ్యం కలిపించడంతో భక్తజనం రామానామ స్మరణతో ఆప్రాంతామంతా మారుమోగింది. అనంతరం తీర్థ ప్రసాదాల వినియోగం తదనంతరం ఉత్తర ద్వారం గుండా స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరి పర్ణశాల పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రధాన ద్వారం గుండా లోపలికి తీసుకొచ్చారు. ఈ ఏడాది భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓలు చంద్రమౌళి, ఎంపీఓ ముత్యాలరావు, సీఐ దోమల రమేష్, సర్పంచ్ తెల్లం వరలక్ష్మి దంపతులు, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ కిషోర్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా ఆలయ అలంకరణ

పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో గతానికి భిన్నంగా ఈ ఏడాది ముక్కోటి ఏకాదశి అధ్యాయనోత్సవాలు, తెప్పోత్సవం, ఉత్తరద్వార దర్శనంలు జరిగాయినట్లు భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది ఆలయ అలంకరణ పచ్చి పూలతో చేపట్టి ఆలయానికి నిండుదనం తీసుకువచ్చారు. ఈ ఏడాది ఉత్తరద్వార దర్శనం భద్రాచలంలో నిర్వహించేలా దూపం అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వడంతో భక్తులు నూతన అనుభూతిని పొందారు. ఈ మార్పులకు ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్‌లు కృషి చేసినట్లు తెలుస్తోంది.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

అన్నపురెడ్డిపల్లి: మండలంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వెంకటేశ్వరస్వామి వారు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శనివారం భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనం ఇచ్చారు. సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే తెరుచుకునే ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి 8 గంటల వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామాలలోని పుర వీధులలో ఊరేగించారు.ముక్కోటి ఏకదశిని పురస్కరించుకొని ఆలయ అధికారులు ఆలయాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ మేనేజర్ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారిని ఆలయ మాజీ చైర్మన్ వనమాగాంధీ దంపతులు, ఇతర నాయకులు దర్శించుకున్నారు.

పలు ఆలయాల్లో..

ములకలపల్లి: ముక్కోటి పర్వదినాన్ని మండలవ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ నేపద్యంలో ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచే మహిళలు, చిన్నారులు భారీగా ఆలయాలు చేరుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.. స్థానిక పూజారుల మంత్రోచ్ఛరణ నడుమ ఉత్తరద్వారంలో ఉత్సవమూర్తులను వీక్షించి, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ములకలపల్లిలో శ్రీభక్త అభయాంజనేయస్వామి ఆలయంలో స్థానిక పూజార్లు ముకందల సత్యనారాయణశాస్త్రి, విస్సావజ్ఝల సురేశ్‌శర్మ, ముకందల సంతోష్‌శాస్త్రిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు శగనపాటి రవి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులకు స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. బోడెం వెంకన్నశాస్త్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు.

అశ్వారావుపేటరూరల్: ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని నారాయణపురం, పెదవాగు ప్రాజెక్ట్, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, వినాయకపురం, తిరుమలకుంట, అనంతారం, ఊట్లపల్లితోపాటు అశ్వారావుపేటలోని రామాలయం, వాసవీ అమ్మవారి ఆలయం, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాలు, డ్రైవర్స్ కాలనీ, నందమూరినగర్‌లోని రామాయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. నారాయణపురంలోని ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వత్రాలు చేసి, స్వామి వారికి అభిషేకాలు చేశారు. దాంతో ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

సేంద్రియ పంటలతో మేలు

దమ్మపేట: సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు మానవాళి ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు అఫ్జల్‌బేగం అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లారం గ్రామంలోని సేంద్రియ రైతు కౌతా మహేష్ వ్యవసాయ క్షేత్రంలో, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్, గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏడీఏ అఫ్జల్ బేగం మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల పంటలను, చీడ పీడలు ఆశించడమే గాక పంటకు మేలు చేసే కీటకాలు కూడా చనిపోతున్నాయని అన్నారు. అతిగా ఎరువులు, పురుగు మందుల వాడకం వలన అధిక దిగుబడి సాధించినప్పటికీ, అవి మానవాళి ఆరోగ్యానికి చేటుగా మారాయి అని పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహార పంటలు ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. సేంద్రియ సాగుకు కావలసిన మిశ్రమాలు, కషాయాల తయారీ విధానాలను సమగ్రంగా వివరించారు. ఈ విధానంలో సాగు చేయడం వలన విషతుల్యం కాని పంటల ఉత్పత్తితో పాటుగా, భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు. పంట ఉత్పత్తులకు ఆహార విలువలు జోడించి అమ్మడం వలన రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ప్రతి రైతు తమకు కావల్సిన ఆహార పంటలను సేంద్రియ విధానంలో పండించుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో మహేష్ అను రైతు స్వయంగా తయారు చేస్తున్న బెల్లం, వంటనూనెలు తయారీ విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించి, వివరించారు. శిక్షణకు హాజరైన రైతులు అందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ మేనేజర్ ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, చెలికాని సూరిబాబు, కొక్కెరపాటి పుల్లయ్య, అత్యం వెంకటేశ్వరరావు, ఏఓ చంద్రశేఖరరెడ్డి, ఏఈఓలు దీప్తి, అనుబాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్‌బేగం

సెమీ క్రిస్మస్ వేడుకలు



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, సంఘస్తులు



మణుగూరురూరల్: ఎక్స్‌లెంట్ స్కూల్‌లో కేక్ కట్ చేస్తూ..

అశ్వారావుపేటరూరల్: స్థానిక సీఎస్ఐ చర్చిలో శనివారం రాత్రి సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘ పెద్దలు ఎం.దేవదానం చేతుల మీదుగా కేక్ కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఏసు క్రీస్తు గీతాలను ఆలపించారు. చిన్నారులు, యువతులు ప్రత్యేక నృత్యాలు చేయగా ఆకట్టుకున్నాయి. విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరు కాగా, చర్చిలో సందడి నెలకొంది.

ములకలపల్లి: మండలకేంద్రంలోని జీవన్‌జ్యోతి, జగన్నాథపురంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూళ్లతోపాటు వివిధ చర్చిల్లో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో క్రీస్తు వాక్యాన్ని వివరించారు. కేక్ కట్ చేశారు. ఆయాపాఠశాల్లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఎక్స్‌లెంట్ హైస్కూల్‌లో శనివారం ముందస్తు క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేక్‌ను ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, ఎండి.ఖాదర్‌లు కట్ చేసి చిన్నారులకు తినిపించారు. మాట్లాడుతూ.. యోహోవా దేవుడు ప్రజలందరికి ప్రేమ, శాంతి, సంతోషం, కరుణ, దయ పంచేందుకు క్రీస్తును ఈలోకానికి పంపారన్నారు. ప్రతీ ఒక్కరికి ఏసు ప్రభువు చూపిన మార్గంలో నడవాలన్నారు. ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎండి యాకుబ్ షరీఫ్, ఉపాధ్యాయులు రాజారత్నం, థామస్ సుష్మెల, విజయ, కల్పన, వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుడి రాజీనామా

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలో వెంచేసియున్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, శివాలయ ఆలయ కమిటీ సభ్యులు పానుగంటి వీరవెంకట సత్యనారాయణ(చిట్టిబాబు) తన సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి ఓటమితో ఆలయ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

వైద్యశిబిరం

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారు గుత్తికోయగూడెం ఎర్రబోడు చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు కనకం తునుజ, వెంకటప్రకాష్‌లు గుత్తికోయ మహిళలు, పిల్లలు, వృద్ధులను వైద్యపరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై వైద్యులు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యండీ ఇమాం, చంద్రకళ, శ్రీనివాస్, ఆశవర్కర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్లు అందజేత

చర్లరూరల్: వనవాసీ కల్యాణ పరిషత్తులో చదువుతున్న విద్యార్థులకు శనివారం దివంగత చీమకుర్తి శేషుబాబు జ్ఞాపకార్థం రూ.3 వేల విలువ చేసే వాటర్ బాటిళ్లను చీమకుర్తి సాయి చరణ్, శివరాజు కిషోర్‌లు అందజేశారు. ఆదివాసీ విద్యార్థులు వనవాసీ కల్యాణ పరిషత్తులోని కొమరం భీం విద్యానిలయంలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో నిలయం ప్రముఖ్ గొంది ప్రసన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో గల భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు శనివారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

27న అరుణాచలేశ్వరుడి ఉత్తర ద్వార దర్శనం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని శ్రీద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం సహస్రలింగం చిన్న అరుణాచలంలో ద్వితీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 27వ తేదీన అరుణాచలేశ్వరుడి ఉత్తరద్వార దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి శనివారం ఓప్రకటనలో తెలిపారు. 25వ తేదీన నంది వాహనంపై బిక్షాటన మూర్తిగా, 26వ తేదీన హంసవాహనంపై అర్ధనారీశ్వరస్వామిగా, 27వ తేదీన ఆదిశేష వాహనంపై అరుణాచలేశ్వరుడిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

మణుగూరురూరల్: సింగరేణీ కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలోపి భద్రాద్రి స్టేడియంలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరిగాయి. వేడుకలను ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం దుర్గం రామచందర్ సింగరేణి పతాకాన్ని ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం సింగరేణియులకు,అధికారులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ సీఅండ్‌ఎండీ ఎస్.శ్రీధర్ సారథ్యంలో ఎంతో పురోభివృద్ధి చెందుతోందన్నారు. సంస్థ ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తూ.. విద్యుత్ రంగంలోనూ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్ల సమిష్టి కృషితో ఉత్పత్తి, ఉత్పాదకతల్లో మణుగూరు ఏరియా సత్తా చాటుతోందన్నారు. అనంతరం స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను, సింగరేణి సేవ సమితి, ఏటీబీ అండ్ కమ్యూనికేషన్ స్టాల్స్, భరోసా వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ వెంకటరమణ, పీఓలు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, ఏజీఎం (కేపీయూజీ) వీరభద్రరావు, ఏజీఎం(ఈఅండ్‌ఎం) నర్సిరెడ్డి, డీజీఎం (పి) ఎస్.రమేష్, డీవైసీఎంఓ మేరీకుమారి, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, లేడీస్ క్లబ్ సేవ సభ్యులు, సింగరేణియులు, కుటుంబ సభ్యులు, పురజనులు పాల్గొన్నారు.



సింగరేణి పతాకానికి వందనం చేస్తున్న జీఎం, ఉద్యోగులు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జీఎం రామచందర్

30న జాతీయ లోక్ అదాలత్



లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది, పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని జ్యూడిషియల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించినట్లు జడ్జి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో తక్కువ జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే ఈ నెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కరకగూడెం: ఈ నెల 30వ తారీఖున మణుగూరు కోర్టులో 'నేషనల్ లోక్ అదాలత్' నిర్వహిస్తున్నట్లు కరకగూడెం ఎస్సై రాజారాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎటువంటి పెండింగ్ కేసులున్న రాజీ చేసుకునేందుకు ఇరువర్గాల వారు తమను సంప్రదిస్తే వారిని కోర్టులో ప్రవేశపెట్టి కేసులను కొట్టివేస్తామ పేర్కొన్నారు.

కేసులు నమోదైన ఇరు పక్షాల వారు శాంతియుత వాతావరణంలో పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముక్కోటికి మహిళల తాకిడి

- గతంతో పోలిస్తే అధికంగా హాజరు
- పర్ణశాలలోనూ అదే తీరు..
- ఉచిత బస్సు సౌకర్యంతో కదిలిన నారీమణులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే అతి పెద్ద ఉత్సవాల్లో ముక్కోటి ఒక్కటి. ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో తెప్పోత్సవం, ఉత్తర ద్వారా దర్శనాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవడం అనవాయితి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఒక్కప్పుడు ప్రయాణ భారంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అటువైపు వెళ్లిన్నప్పుడు తప్ప ప్రత్యేకించి దైవ దర్శనాలకు, దేవస్థానాలలో జరిగే ఉత్సవాలకు వెళ్ళేవారు కాదు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తుండడంతో రవాణా ఖర్చులు మిగులుతుండడంతో ఆలయాల సందర్శనకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే భద్రాచలంలో జగిరిన ముక్కోటి ఉత్సవాలకు సైతం మహిళ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మహిళా భక్తులు అనుబంధ ఆలయమైన పర్ణశాలకు వెళ్తుండడంతో అక్కడి ఆలయంలో సైతం భక్తుల సందడి నెలకొన్నట్లు ప్రత్యక్షంగా చూసిన స్థానికులు చెబుతున్నారు.

ఆర్టీసీ సైతం భక్తుల కోసం పర్ణశాలకు ప్రత్యేక బస్సులను నడిపింది. ఈ క్రమంలో భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజు 10 వేల మంది మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యంలో కుటుంబ సమేతంగా ఆలయాల సందర్శనకు తరలిరావడంతో ఆర్టీసీకి సైతం ఆదాయం భారీగా పెరుగుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలుపుతున్నారు. ఈ క్రమంలో భక్తుల తాకిడి భారీగా పెరగడంతో భద్రాద్రి ఆలయానికి సైతం ఆదాయం పెరిగే ఆవకాశాలు ఉన్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

దమ్మపేట: క్రైస్తవులకు ప్రభుత్వం పంపిన క్రిస్మస్ కానుకలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అశ్వారావుపేట నియోజకవర్గ స్పెషల్ అఫీసర్ మాధవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. శనివారం మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించగా, స్పెషల్ అఫీసర్ చేతులమీదుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, తహసీల్దార్ ముజాహిద్, కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్, చామర్తి గోపిశాస్త్రి, పగడాల రాంబాబు, సాయిల నర్సీ, పాస్టర్లు దేవయ్య, ఏసుపాదం పాల్గొన్నారు.

బూర్గంపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు క్రైస్తవులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన క్రిస్మస్ కానుకలను జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలచారి, స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, పలువురు పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు క్రిస్మస్ కానుకగా ఏర్పాటు చేసిన బహుమతులను ఎంపీపీ ముత్తునేని సుజాత అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రైస్తవులకు క్రిస్మస్ కానుకగా నూతన వస్త్రాలను అందజేసిన ఎంపీపీ అనంతరం ఏర్పా చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరేష్, ఆర్ఐ నాగమణి, ఎంపీటీసీ సభ్యులు కమటం నరేష్, గాదె జయ, వివిధ చర్చీలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలోని కృపా సీయోను ప్రార్థన మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు ఇస్తున్న క్రిస్మస్ కానుకలను మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 75 కుటుంబాలకు శనివారం కరకగూడెం తహసీల్దార్ కె.చంద్రశేఖర్, ఎస్సై రాజరాం కానుకలను అందజేశారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శైలజ, రెవెన్యూ ఆర్ఐలు షేక్ హుస్సేన్, రాజు, చర్చి పాస్టర్ పాలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక రైతు వేదిక భవనంలో శనివారం క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన క్రిస్మస్ కానుకలను లబ్దిదారులకు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలానికి 325 మందికి ఈ కానుకలు మంజూరు కాగా, లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి మాధవి, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, సర్పంచ్‌లు నార్లపాటి సుమతి, అట్టం రమ్య, సొసైటీ అధ్యక్షులు సిహెచ్ సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.పాషా, ఎంపీటీసీలు తిరుమల, భారతి, కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, తుమ్మా రాంబాబు, పాస్టర్లు వెలుగు జాకబ్, రమేష్, శ్యాంసుందర్, వెంకటరత్నం, జయరాజు పాల్గొన్నారు.



దమ్మపేట: క్రిస్మస్ కానుకలను పంపిణీ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్